క్లుప్తంగా

మాజీ ఎమ్మెల్యే ఇంటిపై దాడికి యత్నం..!

పరకాల: దామె చెరువు మట్టిని తీసుకెళ్లవద్దంటూ మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి అధికారులకు ఫిర్యాదు చేశారన్న కోపంతో కొందరు మట్టి ట్రాక్టర్ డ్రైవర్‌లు ఆయన ఇంటివైపు దూసుకెళ్లారు. అదే సమయంలో మొలుగూరి భిక్షపతి ఇంటి వద్ద లేకపోవడంతో సమాచారం తెలియగానే బీజేపీ నాయకులు వెళ్లి వారిని అడ్డుకున్నారు. వెంటనే డయల్ 100 కు ఫోన్ చేసి సమాచారం అందించగా పోలీసులు అక్కడకు చేరుకొని ట్రాక్టర్ డ్రైవర్‌లను బలవంతంగా వెళ్లగొట్టారు.

కుమారస్వామికి డాక్టరేట్


కుమారస్వామి

ఐనవోలు: హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం పున్నేలు గ్రామానికి చెందిన రీసెర్చ్ స్కాలర్ కుమారస్వామి మోరె కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్‌ను పొందారు. కేయూలోని కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగంలో ప్రొఫెసర్ పి వరలక్ష్మి పర్యవేక్షణలో ×ఇంపాక్ట్ ఆఫ్ జీఎస్టీ ఆన్ స్మాల్ బిజినెస్ ఎంటర్ ప్రైజెస్- ఏ స్టడీ ఇన్ తెలంగాణ స్టేట్ॽ అనే అంశాన్ని సమర్పించడంతో పీహెచ్‌డీ అర్హత సాధించినట్లు కేయూ పరీక్షల నియంత్రణ అధికారి మల్లారెడ్డి ప్రకటించారని కుమారస్వామి తెలిపారు. కాగా కుమారస్వామికి శుక్రవారం గ్రామస్తులు, మండల నాయకులు శుభాకాంక్షలు తెలిపి అభినందించారు.

అమరుల జిల్లాగా ప్రకటించాలి

పరకాల: పట్టణ ప్రజల కోరిక మేరకు పరకాలను అమరుల జిల్లాగా ప్రకటించాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గన్నోజు శ్రీనివాసాచారి డిమాండ్ చేశాడు. గడపగడపకు గన్నోజు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డులో ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలు అందించారు. అభివృద్ధి ప్రధాతని చెప్పుకునే ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిని రాబోయే ఎన్నికల్లో ఓడించాలని కోరారు. తనకు ఎమ్మెల్యేగా అవకాశం ఇవ్వాలని కోరారు. మండల అధ్యక్షుడు ప్రకాశ్, ప్రధాన కార్యదర్శి రవీందర్, పట్టణ నాయకులు రామన్న, దిలీప్, గంగాధరి వీరాంజనేయులు, వరంగల్ పార్లమెంట్ ఉపాధ్యక్షుడు రేగూరి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతులకు అవగాహన



నడికూడ: మండల పరిధిలోని పలు గ్రామాలలో ఏఈఓ శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం రైతులకు అవగాహన కల్పించారు. వరి నారు, బీపీటీ 5204, ఎంటీయు 1262 రకం వరి నారుపై పలు సూచనలు చేశారు. 10 నుంచి 14 రోజుల నారు మడి దశలో నత్రజని 1కిలో చల్లాలని, 2-3 సెం.మీ మందంతో నీరు ఉంచాలన్నారు. జింకు లోపం గమనించినప్పుడు 2 గ్రాముల జింక్ సల్ఫేట్ కలిపిన ద్రావణాన్ని పిచికారి చేసుకోవాలని కోరారు. ఇనుపధాతు లోపాన్ని గమనిస్తే నిమ్మ ఉప్పును లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

సభను విజయవంతం చేయాలి



ఎల్కతుర్తి: నేడు (శనివారం) వరంగల్‌లో నిర్వహించతలపెట్టిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ విజయ సంకల్ప సభను విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. భీమదేవపల్లి మండలంలోని వెంకటసాయి గార్డెన్‌లో శుక్రవారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేపట్టిన విజయ సంకల్ప సభకు మండలంలోని బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు పృధ్వీరాజ్‌గౌడ్, నాయకులు దొంగల కొమురయ్య, కవిత, సారయ్య, ప్రకాష్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్లకు అభినందన

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో పరిపాలన పదవులు పొందిన ప్రొఫెసర్లకు రీసెర్చ్ స్కాలర్స్ అసోసియేషన్ కుర్సా ఆధ్వర్యంలో పలువురు శుక్రవారం అభినందనలు తెలిపారు. సోషల్ సైన్స్ డీన్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ మనోహర్, సీడీసీ డీన్ ప్రొఫెసర్ రాంచంద్రం, హాస్టళ్ల డైరెక్టర్ వెంకయ్య, అంబేడ్కర్ స్టడీ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ చిలువేరు రాజ్‌కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

ఉదయం రారు.. సాయంత్రం ఉండరు

- పీహెచ్‌సీలో అరకొరగా వైద్యసేవలు
- మందులు, సూదులకు నిప్పు పెడుతున్న వైనం
- కంపు కొడుతున్న మరుగుదొడ్లు


ఉదయం 10గంటలు కావస్తున్న ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

శాయంపేట: మండలంలోని పేద ప్రజలకు వైద్య సేవలు అందిచాల్సిన ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు అరకొరగా కొనసాగుతున్నాయి. 24 గంటల వైద్య సేవలు అందిచాల్సి ఉండగా వైద్యులు మాత్రం సమయపాలన పాటించకుండా ఇష్టానుసారంగా విధులకు హాజరవుతున్నారు. ఉదయం 10 గంటలు దాటిన పీహెచ్‌సీలో ఖాళీ కుర్చీలే దర్శనమిస్తున్నాయి. సాయంత్రం 6గంటల తర్వాత అత్యవసర పరిస్థితితో పీహెచ్‌సీకు వస్తే నైట్ వాచ్‌మెన్ తప్ప ఎవరూ కనిపించడం లేదనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.

మందులు, సూదులకు నిప్పు..

గడువు దాటిన మందులు, సూదులను ప్రత్యేక పిట్ (సిమెంట్ రింగులతో గుంత) ఏర్పాటు చేసి కాల్చాల్సి ఉండగా, ఆసుపత్రి పరిసర ప్రాంతంలో కుప్పలుగా పోసి నిప్పుపెడుతున్నారు. దీంతో రాసాయన పదార్థాలతో వచ్చే పొగ కమ్ముకుంటుంది. కొన్ని మందులు, సూదులు కాలిపోకపోవడంతో ప్రమాదకరంగా మారుతున్నాయి. ఆ పరిసర ప్రాంతంలోకి వెళ్లేవారికి కాళ్లకు గుచ్చుకునే ప్రమాదం ఉంది.

కంపు కొడుతున్న మరుగుదొడ్లు

చికిత్స నిమిత్తం పీహెచ్‌సీకు వచ్చే రోగుల కోసం ఏర్పాటు చేసి మరుగుదొడ్ల అపరిశుభ్రంగా మారి కంపుకొడుతున్నాయి. అదే విధంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన వాటర్ ఫిల్టర్‌లను ఉపయోగించకుండా పక్కకు పడేశారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు ఫిల్టర్‌నీటిని కాకుండా మామూలు నీటిని అందిస్తున్నారు. వర్షాకాలం డెంగీ, మలేరియా, టైఫైడ్ జ్వరాలు ప్రబలే అవకాశం ఉండడంతో వైద్యులు 24గంటలు అందుబాటులో ఉండాలని ప్రజలు కోరుతున్నారు.


కుప్పలుగా పోసి కాల్చిన మందులు


అపరిశుభ్రంగా ఉన్న మరుగుదొడ్డి


పక్కకు పడేసిన వాటర్ ఫిల్టర్స్

రోడ్డు పనులను అడ్డుకున్న మహిళలు


పనులను అడ్డుకుంటున్న మహిళలు

శాయంపేట : మండల కేంద్రంలో చేపడుతున్న రోడ్డు విస్తర్ణ పనులను మహిళలు అడ్డుకున్నారు. సైడ్ కాల్వలను నిర్మించకుండా రోడ్డు వేస్తే వరద నీరు ఇళ్లలోకి వస్తుందని ఆగ్రహించారు. ఇటీవల కురిసిన చిన్న పాటి వర్షాలకే ఇళ్లలోకి, మంచినీటి కుళాయిల్లోకి మురుగు నీరు ప్రవహించిందని తెలిపారు. రోడ్డు విస్తర్ణలో ఇళ్లు కోల్పోయిన 44 మందికి ఇళ్ల నిర్మాణాలు చేపట్టే విధంగా ప్రొసీడింగ్ కాపీలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఇటీవల చేపట్టిన రోడ్డు విస్తరణ పనుల్లో కొందరు ఇళ్లు కోల్పోతుండడంతో నిర్మాణ పనులు ఆగిపోయాయని అన్నారు. ఇళ్లు కోల్పోయిన వారికి డబుల్‌బెడ్రూం ఇళ్లు మంజూరు చేస్తానని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణరెడ్డి, జెడ్పీ చైర్ పర్సన్ జ్యోతిలు హామీ ఇచ్చి ఆర్‌అండ్‌బీ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారని గుర్తు చేశారు. ప్రజాప్రతినిధుల హామీతో రోడ్డు విస్తరణ పనులకు అడ్డుగా వస్తున్న ఇళ్లను తామే స్వచ్ఛందంగా తొలగించుకుమన్నామని అన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు సైడ్ కాల్వలు లేకపోవడంతో వరద నీరు మంచినీటి సంపులోకి చేరి కుళాయిల ద్వారా మురుగు నీరు వస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సైడ్ కాల్వల నిర్మాణం చేపట్టాలని అప్పటి వరకు రోడ్డు పనులను కొనసాగించొద్దని కోరారు. ఇళ్లు కోల్పోయిన వారికి డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయిస్తూ ప్రొసీడింగ్ కాపీలు అందించాలని సర్పంచ్ రవి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన సర్పంచ్ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, జడ్పీ చైర్ పర్సన్ జ్యోతిలకు పలుమార్లు కోరినట్లు తెలిపారు. త్వరలో సమస్య పరిష్కరించేలా కృషి చేస్తానని మహిళలకు నచ్చజెప్పినప్పటికీ మహిళలు నేరుగా రోడ్డు పనులు చేస్తున్న వాహనాలను అడ్డుకున్నారు. తమ సమస్య పరిష్కారం అయ్యేంత వరకు పనులు కొనసాగించొద్దని అన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి సైడ్ కాల్వలను నిర్మాణం చేపట్టాలని, ఇళ్ల నిర్మాణానికి ప్రొసీడింగ్ కాపీలు అందించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

దిష్టిబొమ్మ దహనం


దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

ఎల్కతుర్తి: ప్రధానమంత్రి నరేంద్రమోదీ పర్యటనను నిరసిస్తూ మండలంలోని ముల్కనూర్‌లో గల అంబేద్కర్ చౌక్‌వద్ద యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం మోదీ దిష్టిబొమ్మ దహనం చేశారు. మోదీ గోబ్యాక్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ నాయకుడు మాడుగుల చింటూ మాట్లాడుతూ రాహుల్ గాంధీ ఎంపీ పదవిపై అనర్హత వేటు వేయడం అప్రజాస్వామ్యమన్నారు. రాహుల్ గాంధీపై అక్రమ కేసులు బనాయించి ఇబ్బందులకు గురిచేస్తున్న బీజేపీకి భవిష్యత్తులో ప్రజలు బుద్ధి చెబుతారని అన్నారు. రాష్ట్రాన్ని ఏం అభివృద్ధి చేశారని మోదీ వరంగల్ పర్యటనకు వస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు చిదురాల స్వరూప, గాంధీనగర్ ఉపసర్పంచ్ శ్రీనివాస్, గ్రామ అధ్యక్షుడు కనుకయ్య, యూత్ కాంగ్రెస్ నాయకులు అజయ్, విజయ్, అఖీల్, రాజేష్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం


పరకాల: జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు


ఐనవోలు: జెండా ఆవిష్కరిస్తున్న జన్ను దినేష్


ఎల్కతుర్తిలో..


ధర్మసాగర్‌లో..

పరకాల: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పట్టణంలో శుక్రవారం ఆ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. స్థానిక బస్టాండ్ కూడలిలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బొచ్చు అనంత్ మాదిగ, దళిత బంధు కమిటీ చైర్మన్ సోదా రామకృష్ణతో పాటు మాజీ కౌన్సిలర్ బొచ్చు దిలీప్‌లు జెండా ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు.

ఐనవోలు: సమాజంలో నెలకొన్న సామాజిక, ఆర్థిక, రాజకీయ అసమానతలను రూపుమాపి సమానత్వం సాధించడమే ఎమ్మార్పీఎస్ ఉద్యమ లక్ష్యమని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జన్ను దినేష్ మాదిగ అన్నారు. ఎమ్మార్పీఎస్ 29వ ఆవిర్భావ దినోత్సవాన్ని కొండపర్తి గ్రామంలో నిర్వహించి జెండా ఆవిష్కరణ ఆవిష్కరించారు. సర్పంచ్ కట్కూరి రాజమణి, సీనియర్ నాయకులు బొక్కల నారాయణ, కట్కూరి ప్రవీణ్, రమేష్, మాదాసి బాబు, సునీల్, అశోక్, అరుణ్, శ్యామల, కోమల, ప్రవీణ్, కోర్నెల్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్కతుర్తి: ఎమ్మార్పీఎస్ 29వ ఆవిర్భావ వేడుకలను మండలంలోని ముల్కనూర్‌లో శుక్రవారం ఎమ్మార్పీఎస్ నాయకుల ఘనంగా నిర్వహించారు. ఆ సంఘం నియోజకవర్గ నాయకుడు మాట్ల వెంకటస్వామి మాదిగ ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు తాళ్ళపెల్లి మధుకర్, పొరనాందుల సురేష్, మహేందర్, స్వామి, మాడుగుల ప్రభాకర్, బాబన్న, రమేష్, రాజు, ధర్మేందర్, తాళ్ళపెల్లి అశోక్, అయిలయ్య, సమ్మయ్య, రాజ్యాలు తదితరులు పాల్గొన్నారు.

దామెర: మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ సంఘం నాయకులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండల అధ్యక్షుడు గోవింద రవికుమార్ జెండాను ఆవిష్కరించారు. మాదిగ జాతి గౌరవంగా, ఆత్మాభిమానంతో జీవిస్తున్నదంటే ముఖ్య కారణం మందకృష్ణ మాదిగనే అన్నారు. పరిమళపాల్, గోవిందు, కరుణాకర్, జిల్లెళ్ల మురళి, జయపాల్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మసాగర్: త్వరలో జరగనున్న పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు బొడ్డు దయాకర్ మాదిగ కోరారు. మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ, ఎమ్మార్పీఎస్ 29వ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మాదిగలందరూ మందకృష్ణమాదిగ వైపే ఉన్నారని, హక్కులను సాధిస్తామని అన్నారు.

పట్టపగలే ఇంట్లో చోరీ


తెరిచి ఉన్న బీరువా

ఎల్కతుర్తి: భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ బీసీ కాలనీలో శుక్రవారం పట్టపగలే చోరీ జరిగింది. దుండగులు ఇంటి తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న 5తులాల బంగారం, 45తులాల వెండి, రూ. లక్ష నగదును అపహరించినట్లు బాధితుడు కనకయ్య తెలిపారు. మధ్యాహ్న సమయంలో ఇంటికి వచ్చిన బాధితుడు ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో ఇంట్లోకి వెళ్లి చూశారు. దీంతో బీరువాలోని నగలు, నగదు కనిపించలేదు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయగా సంఘటన స్థలానికి చేరుకున్న పోలీస్‌లు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

'ఎమ్మెల్యే టికెట్ నాగుర్లకే ఇవ్వాలి'

పరకాల: రాష్ట్రంలోని 20 నియోజకవర్గాల్లో ఎక్కువ శాతంగా ఉన్న ఆరె సామాజిక వర్గానికి న్యాయం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు హింగె శివాజీ, జిల్లా ప్రధాన కార్యదర్శి కిషన్‌రావు, జిల్లా ముఖ్య సలహాదారుడు పేర్వాల లింగమూర్తిలు కోరారు. పట్టణంలో శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర రైతు విమోచన కమిషన్ చైర్మన్‌గా పనిచేస్తున్న నాగుర్ల వెంకటేశ్వర్లు రెండు సార్లు టికెట్ ఆశించినప్పటికి ఇవ్వకుండా అన్యాయం చేశారని ఆరోపించారు. ఇప్పటికైనా పరకాల ఎమ్మెల్యే టికెట్ నాగుర్లకే ఇవ్వాలని, బీఆర్ఎస్ పార్టీ పరంగానే కాకుండా ప్రజల్లో బలమైన నాయకుడుగా ఉంటూ ప్రజలకు అందుబాటులో ఉంటున్నారని తెలిపారు. పార్టీ అధిష్టానం ఆలోచన చేయాలని కోరారు.

రెండో రోజుకు చేరిన సమ్మె..


దామెరలో సమ్మెలో పాల్గొన్న జీపీ సిబ్బంది

పరకాల/ దామెర: తమ న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాలని కోరుతూ పరకాల, దామెర మండలాల్లోని గ్రామపంచాయతీ కార్మికులు, ఉద్యోగులు, సిబ్బంది చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ ఉద్యోగుల సంఘం జేఏసీ మండల అధ్యక్షుడు కోరె సంతోష్ మాట్లాడారు. నాలుగు సంవత్సరాలుగా తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినప్పటికీ కాలయాపన చేస్తుందన్నారు. జీపీ కార్మికులకు అందించే వేతనాలకు ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించడంతో పాటు ట్రెజరీ ద్వారా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాలను పర్మనెంట్ చేయాలని, పీఆర్సీలో నిర్ణయించిన వేతనాన్ని తక్షణమే అమలు చేయాలని కోరారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఐనవోలు: పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు బీమళ్ల సారయ్య, మహేందర్, లింగారావులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, కార్మికుల సమాఖ్య, బ్యాంక్, రైల్వే, ఇన్సూరెన్స్, రక్షణ రంగ ఉద్యోగ సంఘాలు, టీచర్ల సంఘం జాయింట్ ఫోరం ఆధ్వర్యంలో రేపు (శనివారం) కాజీపేటలో, 23వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించనున్న ఐక్య సదస్సుకు సంబంధించిన వాల్ పోస్టర్లను మండల కేంద్రంలో శుక్రవారం వారు ఆవిష్కరించారు.

ముందస్తు అరెస్టులు సిగ్గుచేటు


శాయంపేట: అరెస్టయిన నాయకులు


దామెర: అరెస్టయిన కాంగ్రెస్ నాయకులు


ఐనవోలు: అరెస్టు అయిన నాయకులు

శాయంపట: నేడు ప్రధానమంత్రి నరేంద్రమోదీ వరంగల్ పర్యటనలో భాగంగా తమను ముందస్తు అరెస్టులు చేయడం సిగ్గుచేటని కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ, ఏబీఎస్ఎఫ్ నాయకులు మండిపడ్డారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని అన్నారు. అరెస్ట్ అయిన వారిలో వంగరి సాంబయ్య, అనుకారి అశోక్, మారెపల్లి కట్టయ్య తదితరులు ఉన్నారు.

దామెర: హన్మకొండ పట్టణంలో శనివారం నిర్వహించే బీజేపీ విజయ సంకల్ప సభను దృష్టిలో ఉంచుకొని మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులను పోలీస్‌లు ముందస్తు అరెస్టు చేశారు. సభకు ప్రధాని నరేంద్రమోదీ హాజరు కానున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పొలెపాక శ్రీనివాస్, యూత్ అధ్యక్షుడు సల్ల సుధాకర్, నియోజకవర్గ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ జీవన్, జన్ను కిషోర్, పొలెపాక క్రాంతికుమార్‌లు అరెస్టు అయిన వారిలో ఉన్నారు.

ఐనవోలు: ప్రధాని మోదీ పర్యటన సందర్భంగా తెల్లవారుజాము నుంచి పోలీసులతో అరెస్టులు చేయించడం కాదని, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుతో పాటు విభజన హామీలు నెరవేర్చాలని సీపీఎం మండల కార్యదర్శి కాడబోయిన లింగయ్య శుక్రవారం డిమాండ్ చేశారు. అనారోగ్యంతో డాక్టర్ల పర్యావేక్షణలో ఉన్న తనను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించడం ఏంటని ప్రశ్నించారు. అరెస్టులతో ఉద్యమాలు ఆపలేరని అన్నారు. కాంగ్రెస్, సీపీఎం నాయకులు అరెస్టు అయిన వారిలో ఉన్నారు.

కమలాపూర్: భారత ప్రధాని నరేంద్రమోదీ వరంగల్ పర్యటన సందర్భంగా ఎలాంటి సంఘటనలు జరగకుండా పోలీస్‌లు ముందస్తు చర్యలు చేపట్టారు. మండలానికి చెందిన కాంగ్రెస్, సీపీఐ పార్టీల నాయకులను శుక్రవారం ముందస్తు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై సంజీవ్ తెలిపారు. కాంగ్రెస్ నాయకులు పోడేటి భిక్షపతి, కొండపాక మనీష్, బోయిని హనుమాన్ ప్రసాద్, సీపీఐ నాయకులు జక్కు రాజుగౌడ్, ఇగాపల్లి శంకర్, జెరిపోతుల లచ్చన్న ఉన్నారు.

ఆత్మకూరు: నేడు (శనివారం) వరంగల్‌లో నిర్వహించనున్న బీజేపీ బహిరంగ సభను దృష్టిలో ఉంచుకొని మండలంలోని పలు పార్టీల నాయకులను పోలీస్‌లు శుక్రవారం ముందస్తు అరెస్టు చేశారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పలు అభివృద్ధి పనులు, అనంతరం బహిరంగసభ పాల్గొంటున్న నేపథ్యంలో ఎలాంటి సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టార. మండలంలోని కాంగ్రెస్ పార్టీ, బీఎస్పీ నాయకులను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు.

నడికూడ సర్పంచ్‌పై దాడి


చికిత్సపొందుతున్న సర్పంచ్ రవీందర్‌రావు

పరకాల: రోడ్డు వెడల్పు పనుల్లో భాగంగా తన ఇంటి ప్రహరీ కూలుతుందనే ఆవేశంతో నడికూడ సర్పంచ్ వూర రవీందర్‌రావుపై అదే మండలానికి చెందిన ఓ పత్రిక విలేకరి దాడి చేశారు. ఈ దాడిలో సర్పంచ్‌కు గాయాలు కాగా పరకాల పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సర్పంచ్‌పై దాడి చేసిన విషయం తెలుసుకున్న గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పోలీసు స్టేషన్ ముందు, బస్టాండ్ కూడలిలో ఆందోళనకు దిగారు. దీంతో ఒక్కసారిగా ఉద్రిక్తత చోటుచేసుకుంది. పోలీసులు జోక్యం చేసుకొని ఆందోళనను విరమింపజేశారు. నిందితుడిపై చర్యలు తీసుకునేంత వరకు తమ ఆందోళనలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కాగా, సర్పంచ్ వూర రవీందర్‌ను ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరామర్శించారు. దాడికి గల కారణాలను అడిగి తెలుసుకొని దాడిచేసిన వ్యక్తిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించినట్లు సమాచారం.

విద్యుదాఘాతంతో ఆవు మృతి


మృతిచెందిన ఆవు

ఎల్కతుర్తి: భీమదేరపల్లి మండలం మాణిక్యాపూర్ గ్రామానికి చెందిన ఉగ్గె అశోక్‌కు చెందిన ఆవు శుక్రవారం ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం పశువులను మేముతుండగా ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఇనుప తీగకు విద్యుత్ సరఫరా అయి ఆవు అక్కడికక్కడే మృతిచెందినటు వాపోయారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభ దశలోనే చనిపో వడం బాధకరమని దుఃఖించారు. ఆవు విలువ సుమారు రూ. 80 వేలు ఉంటుందని ప్రభుత్వం దుకోవాలని కోరారు.

దొంగలను పట్టుకున్న రైతులు

ఆత్మకూరు: వ్యవసాయ బావుల వద్ద గల విద్యుత్ మోటర్ల వైర్లను దొంగలిస్తున్న ఇద్దరు వ్యక్తులను రైతులు పట్టుకున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో వ్యవసాయ బావుల వద్ద ఉండే విద్యుత్ మోటార్లను ఓ ఇద్దరు వ్యక్తులు టారేగ్‌ట్ చేశారు. మద్యానికి డబ్బులు లేకపోవడంతో విద్యుత్ మోటర్ల వైర్లను దొంగలించి కొద్ది దూరంలో వైర్లను తగలబెట్టి అందులో ఉండే కాపర్, అల్యూమినియం ,వైర్లను ఇనుప సామాన్ల దుకాణంలో విక్రయించి మద్యం తాగేవారు. శుక్రవారం బ్రాహ్మణపల్లి శివారులో గల ఉప సర్పంచ్ స్వాతి భగవాన్‌రెడ్డి వ్యవసాయ బావి వద్ద వైర్లు దొంగలిస్తుండగా భగవాన్‌రెడ్డి, చుట్టూ పక్కల రైతులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు.

ప్రతీ కుటుంబానికి దళితబంధు వర్తింపజేయాలి


బ్యానర్లు ఆవిష్కరిస్తున్న రాజేందర్

ఆత్మకూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రెండో విడత దళితబంధు పథకం రాష్ట్రంలోని ప్రతీ దళిత కుటుంబానికి వర్తింపజేయాలని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చంచు రాజేందర్ కోరారు. ఈ మేరకు మండలంలోని నాగయ్యపల్లిలో శుక్రవారం బ్యానర్లు ఆవిష్కరించి విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోని ప్రతీ ఒక్క దళిత బిడ్డకు పార్టీలకు అతీతంగా దళితబంధు పథకం అమలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్, నాయకులు గిన్నారపు ప్రసంగి, మేకల సాంబయ్య, జినుక అశోక్, రాజు, కిరణ్, లత, శాంతవ్వ, కుమార్, స్వాతి పాల్గొన్నారు.